

# సృష్టిలో తీయనిది

మాచర్ల హేమ మనోహర్

వారం రోజులనుండీ ఎడతెరిపిలేకుండా పడుతోంది మంచు. ఎక్కడచూసినా మంచు. తెల్లగా అతితెల్లగా స్వచ్ఛంగా మంచు. అందుకే కాబోలు ఈ ఇంగ్లీషు వాళ్ళు అతి తెల్లదనానికి "స్నో వైట్" అంటారు.

తెల్లని పూరేకులు రాలినట్లుగా మంచుకురుస్తూంటే, రోడ్లు, ఇళ్ళకప్పులు మంచులో కప్పబడి తెల్లగా మెరుస్తూంటే చెట్లనిండా మంచుకురిసి ఆ తెల్లదనంలో మంచి అక్కడక్కడా ఆకుపచ్చ రంగు తొంగిచూస్తూ వింత అందంతో శోభిస్తుంటె, సృష్టిలో ఎన్నెన్ని చిత్రమైన అందచందాలో అన్పించింది.

ఆరోజే కాస్త మంచు కురవడం ఆగిపోయింది. అయినా రోడ్లమీద మంచు అంతా ఫ్రీజ్ అయి గడ్డకట్టి కాలుపెడితే జర్రున జారుతోంది. గ్లాస్ [illegible] ఫుట్‌పాత్‌లపై జర్రుజర్రున జారుకుంటూ డాన్సుచేస్తున్నట్లుగా నడుస్తున్న జనాన్ని చూస్తూంటే నవ్వాగలేదు.

కాని నేనూ వెళ్ళాలి షాపింగుకు. ఇంట్లో అత్యవసరమైన వస్తువులు తెచ్చుకోవాలి. ఒక్కసారిగా "ఇండియా" గుర్తొచ్చి మనసంతా దిగులుగా తయారయ్యింది. అక్కడైతే కనీసం పనిమనిషైనా ఉంటుంది సహాయం చేయడానికి. ఈ దేశంలో ఎంత ధనవంతులైనా సరే

ఎవరిపనులు వారే చేసుకుంటారు. కనీసం ఏ చిన్న సహాయం చెయ్యడానికి కూడా ఎవరూ ఉండరు. మావారి కెప్పుడూ వేళాపాళా లేకుండా రాత్రింబగళ్ళూ హాస్పిటల్, పేషంట్లతో సరిపోతుంది, ఏ రెండువారాలకో ఒక్క వీకెండ్ తప్ప. ఇక నాకెలాగూ తప్పదు ఈ ఇద్దరు పిల్లలనూ తీసుకుని షాపింగ్ కెళ్ళడం అనుకుంటూ బయల్దేరాను.

అంత వరకు గ్లాస్‌విండోలోంచి చూస్తూ ప్రకృతి అందాలకు విస్మయ పడుతూ ఆనందించిన నేను ఆ మంచులో నడుస్తూ- ఒకచేత్తో మా "స్మిత" పుష్ చేర్ నెట్టుతూ, ఒకచేత్తో జారుతూపడుతూ లేస్తూన్న మా "వంశీ" చేయిపట్టుకు నడిపిస్తూ ఆ అందమైన మంచును తిట్టు కుంటూ, చిరాకుపడుతూ నడవసాగాను. ఎలాగో త్వరగా షాపింగ్ ముగించుని తిరిగివచ్చి తలుపు తాళంతీస్తూ "అమ్మా పిల్లీ" అని అరిచిన మా స్మిత అరుపుకు ఉలిక్కిపడి చూశాను. నిజంగానే దాని పుష్‌చేర్ ప్రక్కగా స్నోలో తెల్లని చిన్నిపిల్లిపిల్ల చలికి వణుకుతూ ముడుచు కుని కూర్చుని ఉంది. పాపం ఎంతసేపటి నుంచి అలాఉందోకాని దాని బూరంతా నిక్కబొడుచుకుని రేగి ఉంది.

"అమ్మా! పాపం చలిలో ఏల కూర్చుందో మనం ఇంట్లోకి తీసి కేళ్దామా?" అడిగాడు వంశీ. వాడి తెలుగుభాషా పరిజ్ఞానానికి నవ్వుకుంటూ సరేనన్నాను.

పిల్లిపిల్లను హీటర్ దగ్గరగా కూర్చొ బెట్టి ఓ ప్లాస్టిక్‌గిన్నెలో కాసిన్ని పాలు పోస్తే ఆత్రంగా త్రాగింది. అప్పుడు కాని దాని నోట్లోంచి మెల్లగా కూత రాలేదు. మా పిల్లలిద్దరూ కుతూహలంగా దాన్నే గమనిస్తూ కూర్చున్నారు. చిన్ని పిల్లిపిల్ల తెల్లగా ముద్దుగా ఉంది. ఎక్కడినుండి వచ్చిందో ఏమోగాని మాచుట్టుప్రక్కల ఎవ్వరూ సాయంత్రం వరకూ దానిగురించి వెతుకుతున్న వైన మేమీ కన్పించలేదు. ఆ రాత్రి పిల్లల రూమ్‌లో ఓ మూలకు చిరుగులుపడ్డ పాతదుప్పటి మడతలుపెట్టి దానిపై పిల్లిని పడుకోబెడితే బుద్ధిగా నిద్ర పోయిన పిల్లినిచూస్తే చాల ఆశ్చర్యంగా అన్పించింది. "ఇంగ్లీషువాళ్ళు పెంపుడు జంతువులంటె ప్రాణం పెడ్తారు. కన్న బిడ్డలకన్నా మిన్నగా ప్రేమతో పెంచు తారు. అంత చిన్న పిల్లిపిల్ల మా ఇంట్లోకూడా అంత క్రమశిక్షణతో మెది లిందంటె అందులో వింత ఏమీ లేదన్పించింది.

ఓ రెండు రోజులు పాపం అరుచు కుంటూ ఇల్లంతా వెతుకుతూ తిరిగింది. బహుశ తన యజమానికోసమేమో! మా వంశీ, స్మితలకు పిల్లితో ఆడుకోవ డానికి మంచి కాలక్షేపంగా దొరికింది. వంశీ ఇంట్లో ఉన్నంతసేపు, స్కూలు నుండి రాగానే ఒక్కక్షణం వదలకుండా పిల్లితో ఆడుకునేవాడు. స్మిత మాత్రం

దాన్ని కొట్టడం, తోకపట్టి లాగడం లాంటివి చేసేది. ఎంత చెప్పినా వినేది కాదు. కాని వాడు స్కూలుకు వెళ్ళిం తర్వాత స్మిత పిల్లిని ఏమనకుండా చూడడం పెద్ద తలనొప్పిగా తయార య్యింది నాకు. అక్కడికీ చుట్టుపక్కల అందరినీ అడిగాను ఆ పిల్లి ఎవరిదో? తెలిస్తే చెప్పమని. కాని వారంరోజులైనా ఎవరూ రాలేదు పిల్లికోసం.

ఒకరోజు మధ్యాహ్నం వంటగదిలో అంట్లుకడుగుతున్న నాకు పిల్లిపిల్ల దీనంగా అరవడం విన్పించింది. త్వరగా చేతులు కడుక్కొని వెళ్ళిచూస్తే పిల్లిపై దిండువేసి దానిపై కూర్చొనుంది స్మిత. పాపం పిల్లిపిల్ల బాధగా దీనంగా అరు స్తోంది. పట్టరాని కోపంతో ఒక్క పరుగునవెళ్ళి స్మితను లేవదీసి దాని బుగ్గలపై బలంగా దెబ్బలువేసి తీసికెళ్ళి వేరే రూమ్‌లో పడేసి బయట గొళ్ళెం పెట్టాను. కాసేపయింతర్వాత ఎర్రగా కందిపోయిన లేతబుగ్గలపై ధారలుకట్టిన కన్నీళ్ళతో వెక్కెక్కి ఏడుస్తున్న స్మితను చూస్తే జాలేసింది. దాన్ని దగ్గరగా తీసుకుని కళ్ళు తుడుస్తూ "చూడు స్మితా! నేను కొడితే నీకు దెబ్బతగిలింది కదా మరి నీవు పాపం పిల్లినికొడితే దానికీ దెబ్బతగుల్తుంది. నొప్పిపెడ్తుంది. మరిక కొట్టవుకదూ!" అన్నాను. వెక్కి ళ్ళను ఆపుకుంటూ "కొ త్తను" అంది స్మిత.

ఆ మరునాడు ఉదయాన్నే పిల్లల్ని లేపుదామని వెళ్ళిన నాకు స్మిత మంచంలో హాయిగా కప్పుకుని గాఢనిద్రలో ఉన్న పిల్లిపిల్ల కన్పించింది. స్మిత ఏదని ఆశ్చర్యపడుతూ వెతికిన నాకు పిల్లి పడుకునే దుప్పటిపై ముడుచుకుని పడుకుని కన్పించింది. ఒక్కసారి స్మితపై జాలితో నా హృదయం ద్రవించింది. దగ్గరగా వెళ్ళిన నా అలి కిడికి నిద్రలేచింది స్మిత. "ఎందుకు స్మిత ఇక్కడ పడుకున్నావు?" అడిగాను ఎత్తుకుంటూ. "అమ్మా! మరి పిల్లికి తలి పెట్టదూ? కింద పడుకుంటె నొప్పి పెత్తుంది" అంది. "మరి నీకు చలిపెట్ట లేదూ?" అడిగాను. "మరి నేను రోజూ పిల్లిని కొత్తినా కదా అమ్మా" అంది స్మిత.

ఆ రోజునుండీ స్మిత, పిల్లి ప్రాణ స్నేహితులైపోయారు. స్మిత ధర్మమా అని పిల్లికి కప్పడానికి మరో పాత దుప్పటి ఉపయోగించాల్సి వచ్చింది.

ఓ రెండు వారాల తర్వాత ఉదయాన్నే కాలింగ్‌బెల్ విన్పించి తలుపుతీసిన నాకు అపరిచితురాలైన ఓ నడివయసు స్త్రీ కన్పించింది. నా వెనకే పరుగెత్తుకొచ్చిన పిల్లిపిల్ల "జానీ" అని ఆమె పిలవడంతో ఒక్కపరుగున వెళ్ళి ఆమె చేతుల్లో వాలిపోయింది. ఆమె ఎవరో చెప్పకనే తెలిసింది నాకు. పరిసరాలనుకూడా గమ నించకుండా కన్నీళ్ళతో "జానీ! మైలవ్,

"మైడార్లింగ్! ఐ కాంట్ లివ్ వితౌట్ యు" అంటూ తప్పిపోయినబిడ్డ దొరికిన తల్లిలా సంతోషపడుతూ జానీ ఒళ్ళంతా ప్రేమగా నిమురుతూ ముద్దులతో ముంచెత్తుతూ సంబరపడిపోయింది. జానీని భుజంపైన పడుకోబెట్టుకుని జోకొడుతూ చెప్పింది. తన పేరు "లిండా" అని, తన పిల్లలందరూ ఎవరి దారిన వారు వెళ్ళిపోయారని, భర్త చనిపోయాడని, తను ఒంటరిగా ఉందని, తనకు 'నా' అనే ఆప్తురాలు, స్నేహితురాలు అన్నీ ఆ 'జానీ' యేనని, అది తప్పిపోయిన ఆ మూడువారాలు తనెంత బాధపడిందో చెప్తూ తనింటికెప్పుడైనా రమ్మని, అడ్రస్, ఫోన్‌నంబర్ ఇచ్చి వెళ్ళింది. ఏం జరిగిందీ అర్థంకాక తెల్లబోయి చూస్తూ నిలబడిఉన్న వంశీ, స్మితలను తిరిగి తిరిగి చూస్తూ వెళ్ళింది జానీ.

ఆ తర్వాత "పిల్లినీ ఆమె యెందుకూ తీసుకెళ్ళిందీ?" అడిగిన వంశీకంతా వివరించి చెప్పాను. ఇక పిల్లి మళ్ళీ రాదని తెలిసిన వంశీ, స్మితలు ఒక్కసారిగా ఏడవటం మొదలెట్టారు. ఆ పిల్లిని అప్పుడప్పుడూ వెళ్ళి చూడొచ్చని ఓదార్చి నచ్చచెప్పేసరికి ఓ రెండు గంటలు పట్టింది.

ఒకరోజు ఫోన్‌చేసి లిండాను పిల్లిని చూడడానికి వస్తామని అడిగి, వంశీ, స్మితలకు ఆ విషయం చెప్పాను. వారి ఉత్సాహం అంతా ఇంతా కాదు. "అమ్మా పిల్లికి ఏమాయినా తీసూకెళ్దామా?" అడిగాడు వంశీ. పిల్లల ఉత్సాహాన్ని కాదనలేక మధ్యదారిలో కిటీక్యాట్ (క్యాట్ ఫుడ్) టిన్‌కొని తీసికెళ్ళాము. పిల్లిని చూడగానే పిల్లల ఆనందం వర్ణనాతీతం. పిల్లికూడా మమ్మల్ని గుర్తుపట్టి "మ్యావ్ మ్యావ్" అంటూ మా చుట్టూ తిరగసాగింది. కాసేపు కూర్చుని ఇంటికి వచ్చాము. వంశీ, స్మితలు పిల్లిని వదలలేక వదలలేక వచ్చారు. లిండాతో చెప్పాను. ఎప్పుడైనా "జానీ"ని మా ఇంటికి తీసుకురమ్మని. దారిలో అడిగింది స్మిత, "అమ్మా పిల్లీ మనింతో పడుకోదా?" అని. "ఊపుడూ పిల్లి వాళింట్లో ఉందీ వాళ్ళమ్మ లిండా దగ్గరా నిద్ర పోతదీ" సమాధానం చెప్పాడు వంశీ.

పిల్లలకు పిల్లితో స్నేహం ఆలోచిస్తే నాకే నవ్వొచ్చింది. మూడువారాల అనుబంధం మరి. "మనిషి మనిషితో స్నేహం చేసినా, జంతువులతో స్నేహంచేసినా స్నేహం స్నేహమే. జంతువులతో స్నేహం చేసినంతమాత్రాన దాని విలువ ఏమాత్రం తరగదు అని లిండాను, మా పిల్లలను చూస్తే తెలిసింది నాకు. అందుకే అంటారు కాబోలు—

"సృష్టిలో తీయనిది స్నేహమేనోయి" అని.

———